క్లుప్తంగా

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలించరాదు

– వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డికి వినతి



రవీంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీజీబీ బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను ఉపసంహరించాలని బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హరిప్రసన్నకుమార్, కె.జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం వారు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. రవీంద్రనాథ్‌రెడ్డి స్పందిస్తూ ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల దృష్టికి తీసుకు వెళతామని, బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగేలా తమవంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హనుమంత రెడ్డి, మహమ్మద్, పీవీ రాహుల్‌తేజ్, కేఎస్ లోహిత్ మనోజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను తరలించరాదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ జిల్లాలో ఉన్న ప్రభుత్వ సంస్థలను అమరావతికి తరలించరాదని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలోని ప్రధాన కార్యాలయాలు అమరావతికి తరలించడానికి సన్నాహకలు చేస్తుందని, అందులో భాగంగా కడప కొప్పర్తిలో ఉన్న ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాలను తరలించాలని చూస్తున్నారన్నారు.

సమాజాభివృద్ధిలో పురుషులకు ప్రధాన పాత్ర

కడప కల్చరల్ : సమాజం అభివృద్ధిలో పురుషులకు ప్రధాన పాత్ర ఉందని అల్‌షిఫా నిర్వాహకులు రఫీ అన్నారు. ప్రపంచ పురుషుల దినోత్సవ సందర్భంగా మంగళవారం పాత రిమ్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఉభయ జిల్లాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించే ఎన్జీఓల ప్రతినిధులను సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. ఖూన్ కా రిస్తా, ఎస్ఆర్‌పీ సంస్థలతో కలిసి అల్‌షిఫా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో పురుషులకు ఎంతో బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉదయశ్రీ, పర్వీన్ నాజ్, సైకాలజిస్టు సునీత, స్థానిక మహిళా ప్రముఖులు పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సులను అందించాలి

వైవీయూ: విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలను అందించే కోర్సులను ప్రవేశపెట్టడం అభినందనీయమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో 'ఫ్లవర్ అరేంజ్‌మెంట్, ఫ్లోరల్ జువెలరీ'పైన నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వృక్షశాస్త్రం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ మహిళా పారిశ్రామిక వేత్త మాట్లాడుతూ అనంతమ్మ మాట్లాడుతూ విద్యార్థుల చేతుల మీదుగా ఇలాంటి ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను పూర్తి చేయించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. అనంతరం సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఘనంగా 'పులికంటి' వర్ధంతి

కడప కల్చరల్ : ప్రముఖ రచయిత, కళాకారుడు డాక్టర్ పులికంటి కృష్ణారెడ్డి నిక్కారైన రాయలసీమ చిన్నోడని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడప స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో జిల్లా రచయితల సంఘం పులికంటి 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాళ్ల మధ్య బతికే రాయలసీమ వాడినని పులికంటి చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు నినదించారన్నారు. ఆయన నటుడిగా, రచయితగా, కవిగా, నాటక కర్తగా, బుర్రకథకుడిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని తెలిపారు. ఆయన రచనలపై పరిశోధనలు చేసి నలుగురు పీహెచ్‌డీ డిగ్రీ, ముగ్గురు ఎంఫిల్ డిగ్రీ పొందారన్నారు. 2005లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందని అన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పులికంటి రచనల గురించి వివరించారు. అనంతరం జీవకళ సత్యనారాయణ, కవి రామాంజనేయులు, కల్లూరు బాల యల్లారెడ్డి, కళాకారులు మందల మురళి, బ్యాంకు గంగయ్య,బాల ఓబయ్య, పట్నం సుబ్బరాయుడు,శివరాం పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మికంగా ఎదగాలి

కడప కల్చరల్ : యువత ఆధ్యాత్మికంగా ఎదగాలని బ్రదర్ రవి తేజ అన్నారు. మంగళవారం ప్రకాష్ నగర్‌లోని రక్షణ మినిస్ట్రీస్ వారు పాస్టర్ అబ్రహం ప్రిన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు రవితేజ హాజరయ్యారు

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తాండవం

- నామమాత్రంగా మరగుదొడ్లు
- ఆరుబయటే స్నానాలు
- పట్టించుకోని అధికారులు

సాక్షి విజిట్

కడప రూరల్ : కడప నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. పాలకుల తీరు, అధికారుల నిర్లక్ష్యం సంక్షేమ హాస్టళ్లకు శాపంగా మారాయి. దీంతో అక్కడ వసతి పొందుతున్న విద్యార్థులకు ఇబ్బందులుగా మారాయి.

కడప నగరంలో ఇలా..

కడప నగరంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎనిమిది, బీసీ సంక్షేమశాఖ పర్యవేక్షణలో నాలుగు, గిరిజన సంక్షేమశాఖ పరిధిలో రెండు హాస్టళ్లు ఉన్నాయి. ప్రతి హాస్టల్‌లో ఏదో ఒక సమస్య బహిరంగంగానే కనిపిస్తోంది. ప్రధానంగా ప్రకాశ్‌నగర్‌లోని బీసీ బాలుర కాలేజీ హాస్టల్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. అక్కడ 140 మందికి పైగా విద్యార్థులు ఉండగా, నామమాత్రంగా మరుగుదొడ్లు, స్నాపు గదులు ఉన్నాయి. ఈ ప్రాంతమంతా ఒక విధమైన కంపుతో అపరిశుభ్రంగా ఉంది.

ఆరుబయట స్నానాలు

మరుగుదొడ్లు, స్నానపు గదులకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. హాస్టల్ గదులు పట్టపగలే చీకట్లు కమ్ముకుని ఉన్నాయి. ఈ ప్రాంగణంలోనే అదనంగా గోడౌన్లలా ఒక గదిని నిర్మించారు. ఇందులో 60 మందికి పైగా విద్యార్థులు అసౌకర్యంగా ఉన్నప్పటికీ ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. ఎవరైనా చూస్తే అయ్యో పాపం విద్యార్థులు ఎలా ఉండగలుగుతున్నారని అనక తప్పదు. పక్కనే బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఉంది. కాలేజీ హాస్టల్ విద్యార్థులను ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉంచడానికి ఆస్కారం ఉంది. అయితే అధికారులు ఆ దిశగా ఎందుకు చర్యలు చేపట్టడం లేదో అంతుచిక్కడం లేదు. అలాగే కోఆపరేటివ్ కాలనీలో కాలం చెల్లిన పాడు భవనంలో బీసీ బాలికల కాలేజీ హాస్టల్ భవనం నడుస్తోంది. ఇక్కడ 120 మందికి పైగా విద్యార్థినిలు చదువుకుంటున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని అయినా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ నెంబరు-3 హాస్టల్‌లో 40 మంది విద్యార్థులకు పైగా ఉంటున్నారు. ఇక్కడి విద్యార్థులు ఆరుబయటనే స్నానాలు చేస్తున్నారు. ఇది పాడుబడిన భవనం. ఆవరణలో ఫ్యాన్లు బిగించడం మంచిదే. అయితే విద్యార్థులుచేతులను పైకి ఎత్తితే ఫ్యాన్‌కు తగిలేలా ఉండడం గమనార్హం. ఇలా కడప నగరంలోని దాదాపుగా అన్ని హాస్టళ్లలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది.



కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని బీసీ బాలుర కళాశాల హాస్టల్



గోడౌన్‌ను తలపిస్తున్న బీసీ బాలుర కళాశాల హాస్టల్ గది



విద్యార్థులు ఆరుబయట స్నానం చేసే ప్రదేశం



మరుగుదొడ్లకు తలుపులు లేని దృశ్యాలు

సమస్యలను పరిష్కరించాలి



హాస్టళ్లలో మెను సక్రమంగా అమలు కావడం లేదు. హాస్టళ్లకు ఎక్కువ మంది ఇన్‌చార్జి అధికారులు కొనసాగుతున్నారు. విద్యార్థుల రక్షణ కోసం ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి అటు అధికారులు, ఇటు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఎం.అంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అర్హులైన పేదలందరికీ నగరంలో రెండు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణంకు రూ.5 లక్షల రూపాయలు వెంటనే మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి యస్ వెంకట శివ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని 11వ డివిజన్ మృత్యుంజయకుంటలోని సచివాలయం వద్ద పేద ప్రజలకు రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం కసరత్తు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే 1 సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదన్నారు. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామన్న హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఇళ్లస్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో, గ్రామాల్లో నివాసయోగ్యంగా, గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లే-అవుట్లను మార్పుచేసి పేదలకు 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. సరోజనగర్ వద్ద చలమారెడ్డి పల్లె వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్ళకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు మనోహర్ రెడ్డి, సుబ్బరాయుడు, చైతన్య, వెంకటమ్మ, వరలక్ష్మి, తులసమ్మ, ప్రమీల, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న అఖిల పక్షనాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తోపాటు కడప బెంగళూరు రైల్వే పనులు పూర్తికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అఖిల పక్ష నాయకులు పిలుపు నిచ్చారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం డిశంబర్ 8వ తేదీ కడప నగరం ఇంజనీర్ భవన్‌లో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం కడపలోని ఆర్ఆర్ఆర్ కేఫ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం కమిటీ నాయకులు నారాయణ రెడ్డి, సిఆర్‌వి ప్రసాద్, సత్తార్ మాట్లాడుతూ విభజన చట్ట ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఉక్కు పరిశ్రమ కోసం ఏ ఒక్క పార్టీ కూడా చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జరిగితే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఉక్కు పరిశ్రమ కోసం మూడు ప్రదేశాలలో భూమి పూజ చేశారని, నిర్మాణ పనులు మాత్రం జరగకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలకే పరిమితం అవుతున్నాయి తప్ప రాయలసీమ అభివృద్ధి కోసం ఏమాత్రం చిత్తశుద్ధితో పనిచేయలేదని అన్నారు. అంతేకాకుండా ఎన్నో ఏళ్లుగా కడప బెంగళూరు రైల్వే పనులు జరగడం లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని త్వరగతిన రైల్వే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలపక్షం కమిటీ నాయకులు గుర్రప్ప సుబ్బరాయుడు, జయవర్ధన్, శంకర్, రవిశంకర్రెడ్డి, నగిలి రాజేంద్ర ప్రసాద్,అంజనేయులు దస్తగిరి,దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదలో దేశంలోనే మేటిగా కడప



మాట్లాడుతున్న ఆచార్య సాంబశివారెడ్డి

కడప కల్చరల్ : వారసత్వ సంపద విషయంలో వైఎస్సార్ జిల్లా దేశంలోనే మేటిగా నిలుస్తోందని ప్రముఖ చరిత్రకారులు ఆచార్య సాంబశివారెడ్డి అన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల ప్రారంభ సందర్భంగా మంగళవారం కడప నగరంలోని పాత కలెక్టరేట్ ఆవరణలోని ఇంటాక్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో మన జిల్లాలో ఉన్నన్ని వారసత్వ ప్రదేశాలు, సంపద మరెక్కడా లేవని స్పష్టం చేశారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. కడప పెద్దదర్గా మూలాలు ప్రకాశం జిల్లాలో ఉన్న విషయం మనకు అపురూపమైన సంపదగానే భావిస్తున్నామన్నారు. ఇంకా దేశం నలుమూలల మన జిల్లా వారసత్వ సంపద ఉందని తెలిపారు. అధ్యక్షులు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ కలమల శాసనాలకు రక్షణ కల్పించగలిగామని, పాత కలెక్టరేట్ మరమ్మతులకు పూర్వ కలెక్టర్ ఎంతో సహకరించారని, ప్రస్తుత కలెక్టర్ హయాంలో పూర్తి చేయగలమన్న నమ్మకం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వారసత్వ ప్రదేశమైన పాత కలెక్టరేట్‌లో ఈ వారోత్సవాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి కొత్త సభ్యులకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సైకాలజిస్టు ఓవీ రెడ్డి సభ్యత్వాన్ని పెంచడంలో ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పూర్వ కో కన్వీనర్ వేణుగోపాల్, ఎస్.ఎలియాస్‌రెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో వరిలో అధిక దిగుబడి

కడప డివిజన్ ఏడీ శంకర్‌నాయక్



వరిపంటను పరిశీలిస్తున్న ఏడీ శంకర్‌నాయక్, ఏఓ సురేష్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: వరి పంటసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని కడప డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడప మండలం పాలెంపల్లెలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగు మొదలు నుంచి యాజమాన్య పద్ధతులను పాటించడంతోపాటు సకాలంలో పురుగుమందులు, ఎరువులను వాడటం వల్ల మంచి దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది టికూరు వెంకటరమణ అనే రైతు పొలంలో ప్రయోగాత్మకంగా ఖరీఫ్‌లో గొర్రుతో సాగు చేసిన వరి పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారి గొర్రుతో వరిసాగు చేయడం జరిగిందన్నారు. ఈ సాగు ద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతోపాటు సాధారణ సాగు కన్నా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అలాగే సాంబశివ అనే రైతు బాస్మతి బియ్యం 20 సెంట్లలో సాగు చేసిన వరిపంటను పరిశీలించారు. ఇది విజయవంతం అయితే వచ్చే సంవత్సరం మరింత మంది రైతులు ఈ రకం సాగు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి, ఏఈఓ పావని, మెహరాజ్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించండి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రొద్దుటూరు పట్టణం నడింపల్లెలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం-1కు ప్రహరీగోడ నిర్మించాలని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు మంగళవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కోరారు. గతంలో ఉన్న గోడను కూల్చివేశారని, తిరిగి అదే ప్రదేశంలో ప్రహరీ నిర్మించాలన్నారు. వసతి గృహం-1, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం (ఆనంద నిలయం) ఏఎస్‌డబ్ల్యుఓ కార్యాలయం అక్కడే ఉన్నాయన్నారు. మున్సిపల్ హైస్కూలుకు చెందిన మూడు తరగతి గదులు హాస్టల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించారన్నారు. తరగతి గదులకు వెళ్లేందుకు హాస్టళ్ల ప్రహరీ కూల్చివేశారన్నారు. ఇందువల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్ల నుంచి మురికి నీరు బయటికి వెళ్లేందుకు అవకాశం లేకుండా ఉందన్నారు. విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి హాస్టల్ ప్రహరీని నిర్మించాలన్నారు. ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, నరసింహా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మేము సైతం ఆధ్వర్యంలో వృద్ధురాలికి అంత్యక్రియలు



కడప అర్బన్: కడప నగరంలోని శారదానిలయం స్కూల్ పక్కన ఓ అనాథ వృద్ధురాలు మరణించింది. ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో మేము సైతం సేవాసంస్థ ద్వారా అంత్యక్రియలను నిర్వహించాలని సంస్థ ప్రతినిధి అయ్యవారయ్యను కడప టూటౌన్ ఎస్‌ఐ ఎస్‌కెఎం హుసేన్ కోరారు. వెంటనే సేవాసంస్థ సభ్యులు ముందుకు వచ్చి వృద్ధురాలికి ఆత్మబంధువులై హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గురవయ్య, షామియానా సురేష్, శివరాం, రామరాజు, నరసింహ, పుల్లయ్య పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా

కడప కల్చరల్ : సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభతో రాణిస్తూ ముందంజలో ఉన్నారని నగరానికి చెందిన పలువురు ప్రముఖ మహిళలు అభిప్రాయపడ్డారు. 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష అధ్యక్షత వహించారు. మహిళా సాధికారతకు నాణ్యమైన విద్య కీలకమని, అక్షరాస్యత స్థాయి, అవగాహన పెరగడంతో సమాజం విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించింది. నేడు చాలా మంది తల్లిదండ్రులు తమ కూతుళ్లను కొడుకుతో సమానంగా చదివించాలని కోరుకుంటున్నామన్నారు. ముఖ్య అతిథి స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ మాట్లాడుతూ మేధో పరంగా మహిళలే ముందున్నారని, సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. మరో అతిథి, మహిళా పారిశ్రామికవేత్త అనంతమ్మ మాట్లాడుతూ కుటుంబంలో ఒక మహిళ చదువు కుంటే కుటుంబం అంతా అభివృద్ధి లోకి వస్తుందని, ప్రతి ఒక్క మహిళా కూడా అన్ని రంగాల్లో పురోగతి సాధించగలిగే శక్తి ఉన్న వారని తెలియజేశారు. సఖి సెంటర్ ప్రతినిధి అశ్విని మాట్లాడుతూ గృహ హింస, మహిళలపై జరుగుతున్న హింసల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకుని రక్షణ పొందవచ్చునో సూచించారు. ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు, చిత్రకారిణి డాక్టర్ ఎస్.మాధవి మాట్లాడుతూ ఆధునిక కాలంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

ఉత్సాహ భరితంగా క్విజ్

కార్యక్రమంలోని రెండవ విభాగంలో మధ్యాహ్నం నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమాల ముగింపు సభ బుధవారం స్థానిక బ్రౌన్ గ్రంథాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు.

బ్యాంకు ఉద్యోగుల రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎం మురళీమోహన్

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు 119వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ఆ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, ఖాతాదారులు రక్తదానం చేశారు. మంగళవారం కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలోగల బ్యాంకు రీజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆర్‌ఎం మురళీమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 4వ అతి పెద్ద బ్యాంకుగా ఉన్న కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించుకుంటున్న తరుణంలో దేశ వ్యాప్తంగా బ్యాంకు సిబ్బంది వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే తమ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించగా, 119 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారన్నారు. రిమ్స్ బ్లడ్‌బ్యాంకు అధికారులు రక్తనిల్వలను సేకరించారు. రిమ్స్ వైద్యులు రాజేంద్ర కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్లు రమేష్, విలియమ్ కుమార్, ఎల్‌డీఎం జగన్నాథం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి



శిక్షణ ముగింపు కార్యక్రమంలో అధ్యాపకులు

వైవీయూ: విద్యార్థులు ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వం విజ్ఞాన,సాంకేతిక విద్యామంత్రిత్వ శాఖ డీబీటీ ఆర్థిక సహకారంతో కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించిన ×పైథాన్ ఫర్ డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ అల్గారిథమ్స్× అన్న అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు సాంకేతిక అంశాలపై శిక్షణ నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ శాఖ అధ్యాపకుడు డా. ఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. అందుకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సాంకేతికతను వినియోగించుకుని కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, డీబీటీ కన్వీనర్ డా. వై సావిత్రి, ప్రోగ్రాం కన్వీనర్ వై. అనిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ మనోహర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరికరాల వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్

వైవీయూ: ఆధునాతన పరికరాల వినియోగంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవడం ఉపయుక్తమని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో జంతుశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో డీబీటీ స్టార్ ప్రోగ్రాంలో భాగంగా రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బోధన, పరిశోధనలో ఆధునిక పరికరాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైవీయూ జంతుశాస్త్రశాఖ సహ ఆచార్యులు డా. ఎస్. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మానవ పరిణామ క్రమంలో జన్యువుల ప్రాముఖ్యత, అనువంశికత విధానం, జెనిటిక్స్ మధ్య తారతమ్యాలు, డీఎన్ఏ రూపాంతరాల గురించి వివరించారు. కళాశాల బయోటెక్నాలజీ విభాగాధిపతి డా. పి. కల్పన విద్యార్థులకు ప్లాస్మిడ్ ఐసోలేషన్ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష అధ్యాపకులు డా. రవిశేఖర్, డా. వై. సావిత్రి, వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, మహేష్, అపర్ణ, శచీదేవి, శ్రీనీత, చంద్రమోహన్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విదానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వాహనదారుల కష్టాలు





కడప నగరంలోని బిల్టప్ సర్కిల్‌లో ట్రాఫిక్ పరిస్థితి ఈ చిత్రాలు చూస్తే అర్థం అవుతుంది. నిత్యం వాహన'దారుల' అవస్థలు అన్నీఇన్నీ కావు. ఏ వాహనం ఏటు వెళ్తుందో కూడా తెలియదు. ట్రాఫిక్ సిబ్బంది ఉన్నా కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాఫిక్ సమస్యతో వాహనాలు నిలిచిపోయాయి. ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు ఇక్కడ ఇదే విధంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మంగళవారం ఉదయం ట్రాఫిక్ సమస్యపై సాక్షి క్లిక్‌మనిపించిన చిత్రాలు.

– సాక్షి సీనియర్‌ఫొటో గ్రాఫర్, కడప